# ఆప్యాయత

నేను చాల ప్రదేశాల్లో నివసించాను. ఇలాంటి రైలు ప్రయాణా లెన్నో చేశాను. నేను ఈ వేళ విడిచిన పరిసరాలలో పొందిన సుఖం, వచ్చే ముందు జరిగిన ఒకే సంఘటనవలన పడుతున్న బాధ యిదివరకెప్పుడూ చవిచూడలేదు.

రాత్రికాంత కడుపు చీల్చుకొని రైలు కదలుతోంది. నా అంతులేని చింత కత్తిరియై నిద్దర కన్యను నా చెంత చేరనివ్వకుండా ముక్కచెక్కలు చేసింది. నా బాధను పాతిపెట్టాలని ప్రయత్నిస్తున్నా పాతరలో పెట్టిన పందికొక్కులా బయటకు వచ్చేస్తోంది.

ఈ ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో నేనూ, నా భార్య, మా బాబు, పాప నలుగురమే. ముగ్గురూ పడుకున్నారు. రైలు చప్పుడు నా ఆలోచనలకు అంతరాయం కలిగించలేకపోయింది. ఆ చప్పుడుకంటే నా ఆలోచనలవలన నాలో రేగిన హృదయస్పందనలో హెచ్చుగా ఉందనుకుంటాను.

మీలో యెవరైనా కేంద్ర ప్రభుత్వంలో ఆఫీసరుగావుంటే బదిలీ అంటే ఎంత బాధో తెలుస్తుంది. అందులో కుటుంబం పెద్దదై, చదువుకుంటున్న పిల్లలుంటే బదిలీ గండెలమీద కుంపటౌతుంది. నా దురదృష్టమేమిటో యిదివరకెప్పుడూ ఒక ప్రదేశంలో సంవత్సరం దాటి ఉండలేదు. చూసిన ప్రదేశాలే మళ్ళీ చూసేవాణ్ణి. పిల్లల చదువులు సగంలో ఆగేవి. పిల్లలు స్నేహితుల్ని సంపాదించుకునే సమయానికి మళ్ళీ బదిలీ. క్రొత్తప్రదేశంలో కాన్వెంటులో సీట్లు దొరకటం కష్టమయ్యేది. దొరికితే మళ్ళీ డ్రెస్ మార్పు – బోలెడు ఖర్చు. కొత్తప్రదేశంలో కొద్దిగా పాతబడి యింటిమీద, పరిసరాలపైని, కొందరు వ్యక్తులపైని మమకారం పెంచుకోడానికి ప్రయత్నిస్తున్న సమయంలో మళ్ళీ బదిలీ. క్రొత్త ప్రదేశంలో ఇల్లు దొరక్కయే సహోధ్యాయితో ఒక గదిలో గుడుపుకుని యిల్లు కొన్నాళ్ళకి సంపాదించుకుని సర్దుకుంటానంటే బదిలీ.

ఆఖరికి విసుగెత్తి పెద్దలతో తగవు తెచ్చుకున్నాక నాకు విశాఖపట్నంనుంచి మూడేళ్ళ వరకు కదపనని హామీ యిచ్చారు. ఇంతవరకు కృత్రిమ వాతావరణంలో బొంబాయి, కలకత్తా, ఢిల్లీలాంటి ప్రదేశాల్లో, రణగుణ ధ్వనుల మధ్య నివసించిన నాకు యీ యేకాంత ప్రదేశం నిజంగా హాయి నిచ్చింది. ఊరికి యెనిమిది మైళ్ళ దూరంలో చుట్టూ చెట్లు, కొండలమీద నలుపు తెలుపు కప్పుకున్న మేఘాలు రతీ మన్మధుల్లా దోబూచులాడుకునేవి – ఆఫీసు యెదరగానే కాలనీలో విశాలమైన బంగళా.

ముందుకు పూలతోట. పెరట విశాలమైన స్థలం. మెరుపులు మెరిసి ఉరుముల శబ్దంతో నాలో అణగిన సరదాలన్నీ మేల్కొని వర్షానికి మొలచే విత్తనాలయ్యాయ్.

పెరటనున్న సేవకునితో నేనూ కూడి భూమాత కడుపులో గొౖడ్రాళ్ళన్నీ యేరీపారేసి పండించాం.

ఒక అరటి మొక్క నా చేతులతో నాటాను. ఏపుగా పెరిగింది. ఒక్క ఆకు నలుగురు భోజనం చెయ్యటానికి సరిపోతుంది. గాలికి ఆకులు చిరగాలిగానీ యెవరూ కొయ్యటానికి వీల్లేదు. నేను ఆ లావుపాటి అరటి తొండెం చుట్టూ చేతితో తాకితే సిగ్గుతో, మోహంతో తబ్బిబ్బయి శరీరం పులకింపజేసుకున్న ప్రేయసిలా వుండేది. పువ్వేసింది. ముఖిరీ పళ్ళగెల. రోజూ ఉదయం సాయంత్రం తోటలో తిరిగేటప్పుడు నా దృష్టి దానిపైనే ఉండేది. ఒకనాటి సాయంత్రం చెట్టు నన్ను పిలిచినట్టనిపించింది. దగ్గరగా వెళ్ళాను. పైనున్న పెడ పసుపు పచ్చగా మారుతోంది. ఒక పండునప్పుడే ఉడత సగం ఆరగించి నా శబ్దానికి వెళ్ళిపోయింది. మరుచటి రోజు సాయంత్రం ఆఫీసునుంచి వచ్చేసరికి అరటిచెట్టు లేదు. అలా నిల్చుండి పోయాను. సేవకుడు నా భార్య చెప్పగా నరకి గెలను పండవేశాడు. కాస్సేపటికి యెవరో కాంత నా కలలో కనబడి మాటలు అంటున్నట్లుంది. విన్నాను. “నా సంతానం విడిచి మరీ వెళ్ళానుగా!” ఆ పళ్లు పండాక నేను తినలేదు. అర్ధాంగిని పోగొట్టుకున్నాక, పసిపిల్లలను పెంచిన భర్తలాగే యీ అరటి మొక్కలను పెంచాను. పూల తోటలో విరబూసిన పూలను యెవర్నీ ముట్టుకోనిచ్చేవాడ్ని కాను. నేను చూస్తుండగానే అవి వాడిపోయేవి. వేసవిలో బయట మంచం వేసుకుని పడుకునేవాడ్ని. ఉదయమే కళ్ళు తెరిచేసరికి వినీలాకాశంలో కొంగలు, చిలుకులు, కాకులు - యింకెన్ని రకాల పక్షులో కదిలిపోయేవి. దగ్గరగా నున్న చెట్లపై కొన్ని వ్రాలేవి. అరుస్తూనే కదలిపోయేవి.

ఇలాగే ఆ మూడేళ్ళలో ఆ బంగళా ఆవరణలో ఎన్నో మధుర క్షణాలతోపాటు ఆవేదనను కూడా పొందాను. మా పిల్లలిద్దరకీ కోడిపిల్లలకూ వుండిన ఆప్యాయతను చెప్పకుండా వుండలేను.

మా ఆవిడ కోడిమాంసం తినదు. ఎప్పుడో చిన్నప్పుడు కోడిని యెవరో చంపుతుండగా చూసిందట. నాకుమాత్రం కోడిమాంసం అంటే గొప్ప ప్రీతి. నేను చాలాకాలంగా శాకాహారిగా వుండేవాడిని. ఒకసారి బొంబాయిలో ఒక తోటి ఆఫీసరు బలవంతాన తినిపించాడు. క్రొత్తగా మతం మార్చుకున్నవాడిలా అదే పనిగా కోడి మాంసం తినటం మెదలుపెట్టాను. బొంబాయిలో నటరాజ్ హోటల్లోనే కాదు– రోడ్డవార దుకాణాల్లో కూడా తిన్నాను. నేను పనిచేస్తున్న నౌకాదళంలో కోడి మాంసం వండటంలో సిద్ధహస్తులైన ఆఫీసర్లే ఉన్నారు. ఒకరికి మించిన ఉద్దండులొకరు. మా ఆవిడే తెగించి ఒకసారి కోళ్ళు వండింది. తినివుంటే మళ్ళీ విడిచిపెట్టకపోను. కోళ్లను పెంచాం గుడ్లకోసం. గుడ్లుపెట్టాక మా ఆవిడకు మమకారం కలిగి పిల్లలు చేయించింది. పది పిల్లల్లో పోగా పోగా నాలుగు మిగిలాయ్. ఒకటి తెల్లటిది. ఇంకొకటి నలుపుది. మూడోది లేత మెరుపు - ఇవి పెట్టలు. నాల్గోది నల్లటి పుంజు.

ఈ నాలుగూ పుట్టిననాటినుండీ యిలా పెరిగేవరకూ మా పిల్లలిద్దరి సరదా

ఇంతా అంతా కాదు. వాటికి వాళ్ల కిష్టమైన సినీమా స్టార్ల పేర్లు పెట్టారు. పుంజుకు హాస్యనటుని పేరుపెట్టి పిలవగానే వచ్చేది. అలాగే కొన్నాళ్లకు ఆ పెట్టలూ అంతే. వీళ్ళు రొట్టెలు తినకుండా వాటికి పిల్చిపెట్టేవారు. ఒకసారి తెల్లపెట్ట కనపడకపోతే వెతికి తెచ్చి చూపించేవరకు మా పాప ఏడుస్తూ కూర్చుంది.

మేం వాటిని పట్టుకోలేకపోయేవాళ్ళం. పిల్లలిద్దరూ వాటిని పట్టుకుని ముద్దులాడేవారు. నాకూ యేమిటో వాటిపై మమకారం యేర్పడింది. మా యింట్లో పార్టీఐతే పైనించి తెప్పించాంగానీ ఇంట్లోకోళ్లపై మనసుపోలేదు. తెగుళ్ళు రాకుండా ప్రతి ఆరునెలల కొకసారి యింజక్షన్లు యిప్పించేవాళ్ళం. ఉదయమే ఉడకేసినగ్రుడ్లు బజారులో కొన్నామని పిల్లలతో అబద్ధం చెప్పేవాళ్ళం. కోళ్ళూ మా యింటి మనుషుల్లా మెసిలాయి.

ఇలా అందమైన పరిసరాల్లో. అపురూపమైన ఆలోచనలతో. ప్రశాంతంగా బ్రతికి జీవితంలో తొలిసారి సుఖపడిన నాకు బదిలీ వచ్చింది. ఇక్కడ తోటి ఆఫీసర్లతో ఒక విధమైన ఆప్యాయత యేర్పరచుకున్నాను. వీళ్లతో నవ్వుతూనే ఒకప్పుడు యేకీభవించలేదు. ఏమైనా మనసులో ఉంటే పైకి అనటానికి ప్రయత్నించాను. ఆడవాళ్లలో కొంత పొంత వచ్చినా అవి ఆఫీసు వరకూ మొగాళ్ళూ తీసుకుపోలేదు. ఆడవాళ్లయినా యింట్లో అనుకుని బాధపడ్డారు కానీ వీధిలో పడలేదు.

మొత్తంమీద యీ మూడేళ్లు సుఖంగా గడిచాయి. బదిలీమీద ఢిల్లీ వారం రోజుల్లో వెళ్ళిపోతాం అనగా యింట్లో గేస్ స్టౌ వెలగలేదు. విందు భోజనాలతో సరిపోతోంది. రేపు ఉదయం పది గంటలకు యీ వూరికి సలాం చేస్తాననగా ఈ రాత్రి నా ప్రియమైన సహోధ్యాయి ఇంట్లో భోజనం. మాకేకాదు– మిగతా ఆఫీసర్లను, వాళ్ళభార్యలనూ పిల్చాడు. చాలా అట్టహాసం చేశాడు. పాన్‌సింగుకూ నాకూ మాంచి దోస్తీ. అతను అసలు చాలా అమాయకుడు. భార్య యేలుబడి చేస్తుందనే అపవాదుంది. జీతం అంతా పెళ్ళాం చేతిలో పెడ్తాడని, యెక్కడకు వెళ్ళినా ఆమెకు చెయ్యిచాపుతాడని అంటారు. భార్య చాలా కరుకుగా మాటాడుతుందంటారు. ఆమె చాలా అట్టహాసంగా వుంటుంది. తిండీ, బట్టా, యిల్లూ, కారూ యివే సుఖం యిస్తాయనుకుంటే ఆమె కుటుంబాన్ని గొప్పగా సుఖపెట్తోందని చెప్పొచ్చు. నేనంటే చాలా మర్యాద. మా పెద్ద ఆమెకు యేదో చుట్టమౌతాడట. నాకు చెప్పకుండా యింకో యేడాది నన్నిక్కడ వుంచడానికి ప్రయత్నించిందట! లాభం లేకపోగానే చెప్పేసింది. ఇది విన్నాక యిలా ఆమె ప్రయత్నించినందుకు ఆమె మీదనున్న గౌరవం నాకు పోయింది. ఆడే కాలు కూర్చోదు, వాగే నోరు వూరుకోదు. తిరగటం అలవాటు నాకు. మూడేళ్ళు ఒకచోట కొద్దిగా విసిగించింది. మార్పుకు తహతహలాడాను.

డిన్నరునుంచి ఆ రాత్రి యింటికొచ్చేసరికి పండ్రెండయింది. మరుచటి రోజు స్టేషనుకు వెళ్ళేముందు యిరుగుపొరుగు యిళ్ళకు నేనూ నా భార్య వెళ్ళి శెలవు తీసుకున్నాం. పాన్‌సింగు ఇంటికి వెళ్ళేటప్పుడు మా పాప "కోళ్లకు టాటా....బైబై" చెప్పి వస్తానని మాతో వచ్చింది.

పాన్‌సింగు బంగళాబైట నిల్చొని "బాభీ" అని పిల్చాను. ఆమె తలుపు తీసి లోనికి

రమ్మంది. "మరి టైములేదు....ఇదిగో పాప వచ్చింది....సినీస్టార్లకి బైబై చెప్తుందట."

ఆమె మాటాడలేదు. నిల్చుంది. అప్పటికే మా పాప గబగబ వాళ్ళు కోళ్ళుంచినవేపు గట్టిగా వాటి పేర్లతో పిల్చుకుంటూ వెళ్ళింది.

"నాన్నా!" ఒక్కసారి యేడుస్తూ కేకవేసి నా వేపు పరుగెత్తుక వచ్చేసింది. నా చెయ్యి పట్టుకుని యేడుస్తూ జవాబు చెప్పకుండా లాక్కుపోతూ....

"అదిగో...." అంటూ ఆ తోట మూలవేపు చూపించింది. అక్కడ తెలుపు నలుపు, యెరుపు కోడి వెంట్రుకలు ఒక కుప్పగా పడివున్నాయ్.

పాపను ఓదార్చలేక తిరిగివచ్చి,

"నేను అమ్ముకోలేకా? చంపవద్దనిచెప్పి మరీ యిచ్చాను. ఎంతపనిచేశావు బాబీ ?" అన్నాను.

"నీకు కోడి మాంసం అంటే చాలా యిష్టమని...ఎంత తిప్పినా మంచివి దొరకలేదు.." అన్నాక చులకనగా "అవి దేనికి పుట్టాయ్....? మనకోసమేగా!..వెళ్ళండి. రైలు టైమయ్యింది.. మమ్మల్ని మరచిపోకండి" అంటూ గేటువరకు సాగనంపింది.

(జయశ్రీ – నవంబరు, 1967)

❋ ❋ ❋